ఎస్సీ, ఎస్టీ ,అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- గత ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి
- జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణను జనాభా ధామాషా ప్రకారం అమలు చేయాలి
- రాష్ట్ర హెూం మంత్రి అనితను కోరిన జిల్లా దళిత, ఆదివాసీ సంఘాల జేఏసీ నేతలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: దళిత, ఆదీవాసిలకు రక్షణ కల్పించే ఎస్.సి,ఎస్.టి అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనితను శ్రీకాకుళం జిల్లా దళిత,ఆదివాసీ సంఘాల జెఏసి నేతలు డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీనులు కోరారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనకి విచ్చేసిన హెూం మంత్రిని మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో వారు కలుసుకున్నారు. ఎస్.సి,ఎస్.టిలు ఫిర్యాదు చేసిన సమయంలో కేసులను నమోదు చేయడంలో జాప్యం జరుగకుండా చూడాలని విజ్ఞప్తి చేసారు. గత ప్రభుత్వం రద్దు చేసిన దళిత,ఆదివాసీ సంక్షేమ పథకాలు పునరుద్దరించే చర్యలు ప్రభుత్వం తీసుకునేలా కృషి చేయాలని కోరారు. జనాభా గనణ పూర్తయిన తర్వాత జిల్లా యూనిట్ గా ఎస్.సి వర్గీకరణను జనాభా ధామాషా ప్రకారం అమలు చేయాలని విజ్ఞప్తి చేసారు. అర్హులైన ఎస్.సి,ఎస్.టిలకు ఎస్.సి కార్పొరేషన్ ద్వారా ఇచ్చే రుణాలు కొలెటరల్ సెక్యూరిటీ లేకుండా,సిబిల్ పరిగణనలోకి తీసుకోకుండా అందించేలా చూడాలని కోరారు. ఎస్.సి కార్పొరేషన్ ద్వారా భూ కొనుగోలు పథకాన్ని పునరుద్ధరించేలా చూడాలని ,ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేసారు. ఎస్.సి, ఎస్.టి వసృతి గృహాలు మరియు గురుకుల పాఠశాలలు,కళాశాలల్లో అవసరమైన మరమ్మత్తులు చేపట్టడం ద్వారా వసతులు మెరుగుపరిచి విద్యార్థిని,విద్యార్థులకి రుచికరమైన ఆహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని హెూం మంత్రి అనితకి డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీనులు అందజేసారు.

ఆది కర్మయోగి విజయవంతానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-మందస: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన కోసం అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని దీనిలో భాగంగా ఆది కర్మయోగి కార్యక్రమంను అమలు చేసేందుకు కృషి జరుగుతుందని మందస ఎంపీడీవో ఆలువాడ తిరుమల కుమార్ అన్నారు. మంగళవారం మందస మండల పరిషత్ సమావేశపు భవనంలో ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా మండలంలోని గిరిజన గ్రామాల పరిధిలో పనిచేస్తున్న అన్ని శాఖల ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన ఉద్యోగులంతా గ్రామాల్లోని గిరిజనుల సమస్యలపై అధ్యయనం చేయాలని గిరిజన గ్రామాలకు కావలసిన అభివృద్ధి పనులను గుర్తించాలని గిరిజనుల వ్యక్తిగత, సామాజిక సమస్యలను గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మిస్కా శ్రీకాంత్,ఎంఈఓ ఎం లక్ష్మణరావు,మండల పరిషత్ సూపరింటెండెంట్ ఋషేశ్వరరావు, ఉపాధి ఏపీఓ బి.హరికృష్ణ, వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు, ఎం.ఆర్.సి. ఎం. శ్రీనివాసరావు, ప్రోగ్రాం జిల్లా మాస్టర్ ట్రైనీ ఇబ్రహీం కోర్స్ డైరెక్టర్ బి సీతారాం, మాస్టర్ ట్రైనీలు కే, తిరుపతిరావు ఎస్ శేషగిరిరావు ఎస్ మనీషా వి రాణి పి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

తీరప్రాంత గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

విశాలాంధ్ర సంతబొమ్మాలి. తీరప్రాంత మత్స్యకారుల జీవనోపాధి భద్రతను పెంపొందించేందుకు, గ్రీన్ క్లైమేట్ ఫండ్, కేంద్ర బృందం మరువాడ, వడ్డీతాండ్ర గ్రామాలను మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా మత్స్యకారులతో కేంద్ర బృందం ప్రతినిధులు డాక్టర్ మొహమ్మద్ రఫీ, డాక్టర్ జయంతి సితార్ ముఖాముఖి మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వివిధ ఉపాధి మార్గాలను సూచించారు. సముద్రపు నాచు సాగు, అలంకరణ చేపల, ఆల్చిప్పలు, పీతల పెంపకం వంటి కార్యకలాపాల ద్వారా మత్స్యకార కుటుంబాల ఆదాయం పెరగవచ్చని వారు తెలియజేశారు. ఈ రంగాల్లో ఉచిత శిక్షణతో పాటు, ఆర్థిక సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.జయంతి ప్రసాద్, సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు, మేఘవరం ఎంపీటీసీ సూరాడ రాజారావు, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ గంట లోకేష్, టెక్కలి ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్ ధర్మరాజ్ పాత్రో, లైవ్‌లిహుడ్ అసోసియేట్ జి. సుబ్బారావు, ఉపాధి హామీ పథకం ఏపీడీ, ఏపీవో నరసింహమూర్తి, వడ్డీ తాండ్ర, మరువాడ మత్స్యకారులు పాల్గొన్నారు.

జీవితంలో ఉన్నత స్థానాలకు ఎలా ఎదగాలి

విశాలాంధ్ర-టెక్కలి: విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎలా ఎదగాలని అంశాలపై యుఎస్‌కు చెందిన మనితోబా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ పెడద ఐతమ్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలం పరిధిలోని ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ ఆఫ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆయన సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ వంటి ఉపాధి కోర్సుల లో, వ్యాపార, ఉద్యోగ రంగాలలో విద్యార్థు లు తమ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎలా ఎదగాలి అన్న అంశం పై పలు ప్రయోగాత్మకమైన అంశాలతో శిక్షణ ఇచ్చినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వివి నాగేశ్వరరావు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అవగాహన కల్పించినందుకు నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయనకు మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఎస్ శ్రీనివాస్ రావు, అధ్యాపకులు నరేష్ తంగుడు, ప్రియాంక తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

బీఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను పూజించాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించి వచ్చిన ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివా సరావు అన్నారు. నగరంలోని క్రిస్టల్ ప్యాలెస్ ఆవరణలో 500 వినాయక మట్టి విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకుడిని పూజించడం అంటే ప్రకృతిని పూజించడమేనని వివరించారు. విఘ్నాన తొలగించే వినయ్ చవితిని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో చేసుకొని స్వామి వారి ఆశీస్సులు పొం దాలని ఆకాంక్షించారు. ప్రతి ఏటా వినాయక చవితి ముందు రోజు ఉచితంగా వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియో గించడం వలన విగ్రహాల నిమజ్జన సమయంలో చెరువులు, నదిలోని నీరు ఆ రసాయనాల కలయికతో కలుషితమవుతుందన్నారు. దీనివలన జలచరాలకు ఇబ్బందులు వస్తాయని వివరించారు. కావున ప్రతి ఒక్కరూ ప్రకృతితో మమేకమైన మట్టి వినాయకుని పూజించి స్వామి వారి ఆశీస్సులు పొందాలని చెప్పా రు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

సంచార జాతుల దినోత్సవం విజయవంతం చేయండి

విశాలాంధ్ర-సోంపేట: ఈ నెల 30న విజయవా డలో బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు రంగోల గోపి ఆధ్వర్యంలో విజయవాడలో జరుగు సంచార జాతుల దినోత్సవం విజయవంతం చేయాల ని బిజెపి బీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి దున్న శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కంచిలి మండలంలో నివశిస్తున్న బుడగ జంగాలు, చెంచులను కలిసి విజయవాడ సభకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆనింగి భాస్కరరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కన్ను మూసిన రవి కిరణం

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: దన్నాన రవికుమార్ అంటే మండలంలో ఆర్ఎస్ఎస్. ఉనికి కాపాడటానికి అహర్నిశలు కష్టపడ్డ వ్యక్తి. ఆయన చివరి శ్వాస వరకు స్వయంసేవక్‌గా ఉండాలన్నా ఆయన తపన ఎంతో ఉన్నతమైనది. రవికుమార్ మరణంతో చిన్న సలంత్రి శోక సముద్రంలో మునిగింది. రవికుమార్ అంతిమ యాత్రకు ఎవత్ జిల్లా ఆర్ఎస్ఎస్. యంత్రాంగమే కదిలి వచ్చిందని, ఆయన వెలుగు తేజ మని ఆయన మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతి చెందినట్లు బీజేపీ మం డల నాయకులు వి.గోవిందరావు తెలిపారు. ఆయన మరణం సరుబుజ్జిలి మండలానికి పుడ్చలేని లోటు అని పలువురు మండల నేతలు వాపోయారు.

మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-కవిటి: మదర్ థెరిసా సేవలు మరువలేనివని ఆమెను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ వండి బిందుమాధవి, ఏవో రాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం కవిటి కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆమె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆమె నిరుపేదలకు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. కలకత్తాలో 1910 జన్మించారని ఆమె పేదల యొక్క కష్టాల కు ఎన్నో సేవలు చేసినందుకు 1979లో నోబెల్ శాంతి బహుమతి వచ్చిందని తెలిపారు. ఆ ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతలలో స్మార్ట్ రేషన్.కార్డులు పంపిణీ

విశాలాంధ్ర కొత్తూరు. మండలం మాతల గ్రామంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీను కార్యక్రమంలో పాల్గొన్న తేదేపా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు శ్రీ కలమట వెంకట రమణ మూర్తి గారు.

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేసిన ఎంపిపి, మురళీధర్

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని సత్యవరం గ్రామం లో మంగళవారం ఎంపిపి, ఆరంగి మురళీ ధర్ స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లా డు తూ అర్హులైన లబ్ధిదా రులందరికీ నిత్యావసర వస్తువులు అం దించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, కె.వేంక టేశ్వర ప్రసాద్, విఆర్వో, వెంకటరావు, గ్రామస్థులు పాల్గొ న్నారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యునిగా లండ వెంకటరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: భారత కమ్యునిస్టు పార్టీ (సీపీ ఐ) రాష్ట్ర సమితి సభ్యునిగా ప్రస్తుత సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు నియమితులయ్యారు. ఒంగో లులో జరిగిన సీపీఐ రాష్ట్ర 28 వ మహాసభల లో నూతన సమితి ని ఎన్నుకున్నారు. అందులో భాగంగా జిల్లా నుంచి లండ వెంకటరావును ఎన్నుకున్నారు. రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నికైన వెంకట రావుకి సీపీఐ జిల్లా సమితి సభ్యులు అభినందనలు తెలిపారు. రాష్ట్ర సమితి సభ్యునిగా ఎన్నుకున్నందుకు జిల్లా పార్టీ కి, రాష్ట్ర పార్టీకి వెంక టరావు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మరింత బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-టెక్కలి: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సి పాల్ డాక్టర్ టి. గోవిందమ్మ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కెమిస్ట్రీ పిజి లో కనీసం 55 శాతం మార్కు లు, ఏపీ సెట్ లేదా యుజిసి నెట్ అర్హత లేదా పిహెచ్.డి అర్హత కలిగి ఉన్నవారు ఆగష్టు 30 తేదీన కళాశాలలో జరగ బోయే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికేట్లుతో హాజరు కావాల్సిందిగా కోరారు.

జేబిటీ పాఠశాల ఆధ్వర్యంలో వినాయకుని మట్టి విగ్రహాలు తయారీ

విశాలాంధ్ర-జలుమూరు: సారవకోట మండలం అవలంగి జేబీటీ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నుండి వినాయకుని మట్టి విగ్రహాలు తయారు చేస్తున్నారు ఈ ఏడాది చేసిన వెయ్యి విగ్రహాలు పంపిణీ పూర్తయినందున విగ్రహాలు చాలా అత్యవసరంగా తయారు చేస్తున్నట్లు పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ తెలిపారు. గత 12 సంవత్సరాలుగా విగ్రహాలు ప్రజలకు అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మోహన్ గాంధీ తెలిపారు.

అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం వస్తే సమాచారం ఇవ్వండి :ఎస్సై రవివర్మ

విశాలాంధ్ర-కవిటి: మీ గ్రామాల్లో పరిసర ప్రాంతాల్లో అపరిచితల పట్ల అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ ఐ రవివర్మ ప్రజలకు సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఎస్పి కె వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు కవిటి న్యూ కాలనీలో తెల్లవారు జామున కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగం, అపరిచితులు ఎవరైనా కొత్తగా వచ్చిన అనుమానం కల వ్యక్తులు ఉన్నా వెంటనే పోలీసు వారికి సమాచా రం అందజేయాలని అన్నారు. వాహనాలు కూడా సరి అయిన ధ్రువ పత్రాలు కలిగివుండాలని మండలం లో ఎలాంటి అనుమానిత వ్యక్తులు ఉన్నా వెంటనే కవిటి పోలీసు స్టేషన్కు సమాచారం ఇవ్వాలని కోరారు. .ఈ కార్యక్రమంలో హెచ్ సిఆర్. దుర్గారాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ కు గురై పాడి ఆవు మృతి

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా గ్రామాల్లో విద్యుత్ లైన్లు ఒరిగి ఉండడంతో వర్షపు నీరుతో విద్యుత్ తరంగాలు అంతట అలముకుం టున్నాయి. ఈ నేపథ్యంలోనే మునగవలస గ్రామంలో విద్యుత్ స్తంభం పక్కగా వెళుతున్న ఆవు కరెంట్ షాక్కు గురై అక్కడి కక్కడే మృతి చెందింది. కనమట చిన్నప్పన్న రైతుకు చెందిన ఈ ఆవు మృతితో ఆ కుటుంబం ఆందోళన చెం దుతు న్నారు. రైతుకుటుంబానికి ఆసరాగా ఉండే పాడావు మృతి చెందడంతో వా రు రోధి స్తున్నారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ఆవు మృతి చెందిందని గ్రామస్తుల వాదన. ఎన్ని మార్లు చెప్పిన వేలాడే వైర్లను సరి చేసే పాపాను పోలేదని వారు ఆవేదన చెందుతున్నారు. . ఏదిఏమైనా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి పాడావు బలైంది. దీంతో రైతు కంట కన్నీరు తప్పడం లేదు. ఎప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి తీగలపై ఉన్న కొమ్మలను, వేలాడే తీగలను సరిచేయాలని గ్రామస్తులు ముక్తకం ఠంతో కోరుతున్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు వితరణ

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం కొండిపుట్టుగ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం నర్సు. సోమేశ్వ రరావు మరియు ఆ గ్రామానికి చెందిన ఇంటెనుక. పాపారా వులు మంగళవారం తమ సొంత నిధులతో ఐడీ కార్డులు, నోటుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని పిఎం సీ సభ్యులు, గ్రామ స్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యువకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శ్రేయస్సు నింపాలని ఆయలన ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వినాయకుడి ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతోందని, ముందుకు దూసుకుపోతోందని అన్నారు. ఈ పండుగ ఆధ్యాత్మిక, సాం స్కృతిక కార్యక్రమాలతోపాటు, ప్రజల మధ్య శాంతి, ఐక్యత ను పెంపొందించే వేదిక కావాలని ఆయన ఆకాంక్షించారు. గణపతి నవరాత్రోత్సవాలను ప్రజలంతా సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వినాయక చవితి అందరి జీవితాల్లో ఆరోగ్యంతో పాటు సంపదను నింపాలని ఆయన ఆకాంక్షించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉజ్వల భవిత

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: కమ్యూనికేషన్స్ స్కిల్సు పెంపొందించుకోవడంతోనే ఉజ్వల భవిత పొందవచ్చని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్, ఏయూ పూర్వపు వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో మంగళవారం ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర విద్యార్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని ఆకలింపు చేసుకోవాలన్నారు. లక్ష్యసాధన కు పట్టుదలతో చదవాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వపు వీసీ ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాసు మాట్లాడుతూ ప్రతి పదేళ్లకోసారి శాస్త్రసాంకేతిక రంగంలో పెన మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అందుకనుగుణంగా యువత నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. సామాజిక బాధ్యత, మానవతా విలువలతో ముందుకుసాగాలన్నారు. ఐఐఐటీ (అగర్తల) పూర్వపు డైరెక్టర్ ప్రొఫెసర్ పీఎస్ అవధాని మాట్లాడుతూ సమర్థత, సమయపాలన విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. ఇంజనీరింగ్ సబ్జెక్టతో పాటు భారతీయ సంస్కృతి, సం ప్రదాయాలను కూడా కలిగి ఉండాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ ఎంతో కీలకమైన విద్యార్థి దశలో కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి. అడ్డయ్య, వర్సిటీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సీహెచ్.రాజశేఖరరావు, డాక్టర్ ఎం. అనూరాధ, డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్, కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ డి.షాలిని, ఎం. రామారావు తదితరులు పాల్గొన్నారు.

మురికి నీరు ప్రవాహంతో ప్రజలు బేజారు

విశాలాంధ్ర-జలుమూరు: మండల కేంద్రం సారవకోట కర్నూలు వీధిలో కాలువలు కూడికలు తీయకపోయినందున కురుస్తున్న వర్షాలకు కాలువల్లో ఉన్న మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఈ ప్రవాహం వలన పిల్లలు పెద్దలు అనేక అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. చెత్త చెదారంతో నిండిన కాలువల ద్వారా వస్తున్న మురికనీరు వలన అనేక అనర్థాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి కాలువ పూడికి తీతులను చేపట్టాలని పలువురు కోరారు.

పెరుగుతున్న వంశధార నీటిమట్టం

విశాలాంధ్ర-జలుమూరు: బంగాళాఖాతంలో ఏర్ప డిన అల్పపీడన ద్రోణి ప్రభావం వలన ఒడిస్సా ప్రాంతాల్లో వర్షాలు భారీగా కురుస్తున్నందున వంశా ధర నదికి నీటిమట్టం పెరుగుతుం డడంతో నదీ పరివాహ ప్రాంత ప్రజలు భయాం దోళన చెందు తున్నారు. ప్రస్తుతం 16, 17 వేల క్యూసెక్కు లు నీరు నది నుండి ప్రవహిస్తున్నడంతో ఎటువంటి ఇబ్బం దులు ఉండవని 50,000 క్యూసెక్కుల నీరు ప్రవ హిస్తే చిన్నపాటి ప్రమాదాలు ప్రారంభమ వుతాయని ఆప్రాంత ప్రజలు వాపోతున్నారు.

కారుతున్న చరిత్ర గల శ్రీ ఉమాత్రలకేశ్వర స్వామాలయం...

మండల కేంద్రం సారవకోట లో చరిత్ర కలిగిన శ్రీ ఉమాకేశ్వర స్వామి గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్ నుండి దిగువ భాగానికి నీరు కారిపోతుండడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. సుమారు రెండు దశాబ్దాలు కాలం నిర్మించిన ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని ఇది దేవాదాయ శాఖ తిరుమల తిరుపతి దేవస్థానం శాఖ వారి పరిశీలించి భక్తులు సహకారంతో ఆలయ అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

నీట మునిగిన పంట పొలాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వంట పొలాలు నీటమునిగాయి. మండలంలోని తోటపాలెం, కొత్తపేట, మ ద్దాడ తదితర గ్రామాల్లో పంట పొలాల్లో నీరు నిండిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆశాజనకంగా ఉంటుందనుకుంటున్న సమయంలో అధిక వర్షాలు తమకు దెబ్బతీసేటట్టు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయురాలు రాజేశ్వరి డిప్యూటేషన్ రద్దు చేయాలి



విశాలాంధ్ర-మందస: మందస మండలం పట్టులోగాం ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థులను కుల దూషణపై ఉన్నత స్థాయి అధికారితో దర్యాప్తు చేయాలని, ఉపాధ్యాయురాలు రాజేశ్వరి డిప్యూటేషన్ బదిలీని వెంటనే రద్దు చేయాలని దళిత ఆదివాసీ ప్రజా సంఘాల నాయ కులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీతంపేట ప్రజాదర్బార్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ కమిటీ ఛైర్మన్ సవర లక్ష్మీనారాయణ, మందస మండలం గిరిజన సంఘం జిల్లా నాయకులు సవర ధర్మారావు, మందస ఎస్ సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఇప్పిలి, చంద్రశేఖర్, బి మురళీ, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకర్, దళిత సంఘాల జెఏసి జిల్లా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, డీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు రాకోటి రాంబాబు మాట్లాడుతూ మందస మండలం పట్టు లోగాం గిరిజన ఆశ్రమ బాలికొన్నత పాఠశాల ఉపాధ్యాయినిలు చింతాడ రాజేశ్వరి పైన విద్యార్థులు వారి తల్లిదండ్రులు మరియు గిరిజన సంఘాలు కానీ విద్యార్థి సంఘాలు ఎలాంటి పిర్యాదులు చేయకపోయినా ఆమెపై చర్యలు తీసుకొని బుడంభో ఆశ్రమ పాఠశాలకు డెప్యూ టేషన్ వేయడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యార్థులను కులం పేరుతో దూషించిన ఉపాధ్యాయినిలపై చర్యలు తీసుకోమని ఉద్యమిస్తే వారి పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిజాయితీగా పనిచేసిన చిడి రాజేశ్వరి పై చర్యలు తీసుకొన్న అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధి కారి మరియు డిడి చర్యలు దారుణమన్నారు. పట్టులోగాం స్కూ ల్ విద్యార్థులు ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులను తక్షణమే సస్పెండ్ చేయాలనీ, ఎలాంటి తప్పులు చేయని ఉపాధ్యా యురాలు రాజేశ్వరిను పట్టులోగాంలో కొనసాగించాలని, పట్టులోగాం పాఠశాల ఘర్షణలపై వేసిన డీడి, ఎటి డబ్ల్యూఓల విచారణ నివేదికలను తక్షణమే బహిర్గతం చేయాలనీ డిమాండ్ చేసారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం చూపని ఎడల దశల ఆందోళనకు పిలుపు ఇవ్వవలసిన వస్తుందని తెలిపారు. ఈ సంఘటనపై వినతి పత్రం అందజేసిన సంబధిత డిడి దర్యాప్తు పేరుతో కాల యాపన చేస్తూ సంఘటన పూర్తి స్థాయిలో తప్పుదోవ పట్టించే పని చేస్తున్నారనీ ఆరోపిం చారు. పట్టులోగాం ఆశ్రమ పాఠశాల ఘటన పై వేరే నిజాయితీ గల అధికారితో దర్యాప్తు చేయాలని కులంపేరుతో విద్యారులును దూషించిన డి.పద్మ తంగుడు.తెజేస్వని, గీతలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వారిని సస్పెండ్ చేయాలని కోరారు.

లక్ష్మీపురం పాఠశాలను సందర్శించిన డైట్ అధ్యాపకులు

విశాలాంధ్ర సంతబొమ్మాళి. సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురం గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ పాఠశాలను, గార మండలం వమరవెల్లి గ్రామంలో ఉన్న (జిల్లా విద్యా శిక్షణ సంస్థ) డైట్ సెంటర్ చెందిన అధ్యాపకులు మంగళవారం సందర్శించారు.

విద్యార్థులతో డైట్ అధ్యాపకులు చలపాక రమణమూర్తి, మురళి మాట్లాడుతూ, ఇప్పటివరకు జరిగిన పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఎఫ్ ఎల్ ఎన్ అమలతీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, స్థానిక ఉపాధ్యాయులు రెడ్డి సూరిబాబు, సావిత్రమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడదాం

విశాలాంధ్ర సంతబమ్మాళి: సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం జిల్లాపరిషత్ ఉన్న త పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకోసం బుధ వారం జరపనున్న వినాయకచవితి పూజకై మట్టి విగ్రహాలును మాత్రమే పూజకు వినియోగించాలని, పాటశాల ఉపాధ్యాయులు విద్యర్థులచే మట్టివిగ్ర హాలు తయారీ కార్యక్రమము చేపట్టారు. విద్యా ర్థులకు మట్టి విగ్రహాలు తయారీలో పాటశాల జీవ శాస్త్ర ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, ఆర్.అన్నజీ శి క్షణ ఇచ్చి వారితో మట్టివిగ్రహాలను తయారు చేయించారు. 214 మంది విద్యార్థులు బృందాలుగా ఏర్ప డి, 72 విగ్రహాలను తయారుచేశారు. విద్యార్థులందరూ 'మట్టి విగ్రహాలనే పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడదాం' అని నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు తూట భాస్కరరావు, తిరుప తి రావు, జె.శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, నాగేశ్వరరావు, శారదాంబ, లక్ష్మీనా రాయణ, మురళీధరరాజు, రాము, ఉమ,పి.శ్రీధర్,విజయలక్ష్మి, డి.శ్రీనివాసరావు, దయా సాగర్, శ్రీధర్, మార్కండేయులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌ఘఢ్ అగ్ని కుల క్షత్రియ సమాజ్ అధ్యక్షుడిగా ఢిల్లీశ్వరరావు ఎన్నిక

విశాలాంధ్ర-పలాస: ఛత్తీస్ ఘఢ్ అగ్నికుల క్షత్రియ సమాజ్ అధ్యక్షుడిగా నాలుగోసారి తామాడ ఢీల్లే శ్వరరావు ఎన్నికయ్యారు. మంగళవారం త్రైవార్షిక ఎన్నికలు సెక్టర్ -5 లోని కంచి కామాక్షి ఆలయంలో నిర్వహిం చారు. ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీ చేసిన తామాడ ఢిల్లీశ్వర రావు 376 ఓట్ల మెజా రిటీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా బొంగు పాపారావు, కోశాధికారిగా తిమ్మల మానకేశ్వరరావు గెలుపొందారు. మూడేళ్ల కార్య వర్గంలో ఎన్నికైన ఇతర పదాధికారుల వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధ్యక్షులు -తామాడ తులసీ దాస్, రెయ్యి బాలకృష్ణ,ఉప కోశాధికారి -తామాడ రఘునాథ రావు, కార్యదర్శి - దుమ్ము జగపతి, సహాయ కార్యదర్శులు - రెయ్యి జానకీ రాం, బచ్చల గణపతి, కార్యవర్గ సభ్యులుగా అర్జి బాలకృష్ణ,బురకాయల లోకనాథ్, మల్లెన ఢీల్లీశ్వరరావు, జుత్తు అప్పారావు, దున్న తులసీ రావు, బొంగు ప్రకాశ్ రావు, బత్తిన జగదీష్, బత్తిన ప్రవీణ్, బొడ్డు రామారావు,నాయన వెంకట రమణ ఎన్నికయ్యారు.

పర్యావరణ రక్షణలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర-టెక్కలి: పర్యావరణ పరిరక్షణలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని మట్టి వినాయకుడినే పూజించాలని ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనురాధ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాకిపల్లిలో చదువుతున్న విద్యార్థులు మట్టి వినాయకుడిని తయారు చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించడంలో ప్రతి విద్యార్థి పాత్ర ఉండాలన్నారు. వినాయక చవితి గురించి మట్టి వినాయకుడు విశిష్టత గురించి తమ గ్రామంలో ఉన్న ప్రజలకు వివరించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది కె.నారాయణరావు, కే. మురళీకృష్ణ, పి.చిన్నారావు, పి. ఋషి, కే.సుధారాణి, సిహెచ్. భారతి, టీ.వైకుంతరావు, బాడన నారాయణరావు, ఎస్. రమేష్, జి.శ్రీని వాసరావు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేద గణితంలో విజ్ఞాన భారతి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక భారతీయ విద్యా కేంద్రం వారి విజ్ఞాన భారతి పాఠశాలకు చెందిన విద్యార్థులు వేద గణితంలో తమ ప్రతిభ కనబర్చారు. సమితి స్థాయిలో(ఆరు జిల్లాలు) నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు, పొట్నూరు నవనీత్ సత్యసాయి, డొంకాన లికిత్ చంద్ర, ముంగూరు హర్షిత్, సుబ్రహ్మణ్యం ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వేద గణితంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు భారతీయ విద్యా కేంద్రం, కార్యదర్శి, వి.రామసత్యన్నారాయణ, కోశాధికారి, వై.శ్రీధర్, డైరెక్టర్, బి.లక్ష్మీనారాయణ, సమితి సైక్షునికి ప్రముఖ, బి.నారాయణరావు, సహా ప్రముఖ, డి.రాజశేఖర్, ప్రబంధకారిణి కమిటీ అధ్యక్షులు, నానాజీ గాడ్గే, పాఠశాల కరస్పాండెంట్, డా.సురేష్ కుమార్, ప్రధాన ఆచార్య, ఢిల్లేశ్వరరావు, సైక్షనిక్ ప్రముఖ, అనిల్, వేద గణిత ఉపాధ్యాయురాలు, శైలజ, ఉపాధ్యాయులు, శ్రీదేవి, హేమకుమారి, అరుణ, అసూరాధ, సూర్యనారాయణ, అంజలి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు అభినందనలు తెలియచేశారు.

పేద విద్యార్థులకు అండగా జ్ఞానజ్యోతి విద్యా సంస్థలు

విశాలాంధ్ర-నరసన్నపేట: జిల్లాలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు జ్ఞానజ్యోతి విద్యా సంస్థలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని ఇంటర్మీడియట్ విశ్రాంత ప్రాంతీయ అధికారి, శాశనపురి రుక్మాంగదరావు అన్నారు. మంగళవారం స్థానిక కళ్యాణ మండపంలో జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రుక్మాంగధరావు మాట్లాడుతూ గత 30సంవత్సరాల నుండి ఒకే మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి జూనియర్, డిగ్రీ కళాశాలలు నిర్వహించబడుతున్నాయని, కళాశాలలో చదివే అనేక మంది విద్యార్థులు నేడు ఉన్నతమైన స్థాయిలో ఉన్నారన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఐఐటి, నీట్, ఎంసెట్ తదితర ప్రవేశ పరీక్షలకు మొదటి సంవత్సరం నుండే శిక్షణ ఇవ్వటం జరుగుతుందని, ఈ కళాశాలలో చేరి, ప్రతీ విద్యార్థి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వరుదు ప్రవీణ, కళాశాల మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, నేతింటి వెంకట రమణయ్య, మచ్చ నిరంజన్, వెలమల సత్యన్నారాయణ, ఎన్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న యూరియా

ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

విశాలాంధ్ర, ఎల్ ఎన్ పేట: మండలంలోని వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతు సేవా కేంద్రాల్లో యూరియా కొరత ఉండడంతో ఎల్ ఎన్ పేట జంక్షన్‌లో ప్రైవేటు ఎరువుల దుకా ణాల వద్ద మంగళవారం ఉదయం 7 గంటల నుండి ప్రైవేట్ దుకాణాలు వద్ద ఎరువులు కొనుక్కోవాల్సి వచ్చిందని రైతులు ఆందోళన చెందారు. రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉండవలసిన యూరి యా పక్కదోవ పడుతుందని బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. అందు కారణంగా రైతు సేవా కేంద్రాల వద్ద ఇటీవల రైతులు తీవ్ర ఆందోళన చేయడం జరిగింది. ఈ విషయమై స్థానిక వ్యవసాయ అధికారికి పలువురు ప్రజాప్రతినిధులు,విలేకరులు వివరణ కోరగా ఎల్ ఎన్ పేట మండలంలో ఉన్న రైతులందరికీ సరిపడా ఎరువులు అందజేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు కానీ ఏ ఒక్క రైతులకు సరిపడా ఎరువులు అందలేదని పలువురు రైతులు వాపోతున్నారు. రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటనలు వేస్తుంది కానీ సరిపడ ఎరువులు సరఫరా చేయడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతే దేశానికి వెన్నెముక రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం రైతు అభివృద్ధి కోసం రకరకాల పథకాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం అవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.రైతులు దిక్కు తోచని స్థితిలో అధికారుల వద్దకు వెళ్లి అడుగగా ఇదిగో వస్తుంది అదిగో వస్తుందని అధికారులు సమయం దాటవేస్తున్నారు తప్ప సక్రమంగా సరఫరా చేయడం లేదని యూరియాని పక్కదోవ పట్టిస్తున్నారని, బ్లాక్ లో అమ్ముకుంటున్నారని రైతులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతుల కష్టాలు కనీసం పట్టించుకోవడం లేదు. రైతులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామనే ఆలోచన కూడా లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు అన్యాయం జరిగితే ఎరువులు బ్లాక్ లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో ఎటువంటి మార్పు రాకపోవడం వారి అవినీతి అక్రమాలకు రైతుల సమస్య అద్దం పడుతోందని. ఇప్పటికైనా జిల్లా అధికారులు కళ్ళు తెరిచి రైతులు సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వంశధార నీరు లేదు.. ఎరువులు లేవు...

రైతులు సాగుచేసేది ఎలా... మండల సమావేశంలో సభ్యులు ధ్వజం..

విశాలాంధ్ర-పలాస: ఖరీఫ్ కాలంలో రైతులు సాగు చేసేందుకు పలాస మండలానికి ఇంత వరకు వంశధార నీరు కాని, ఎరువులు కాని పంపిణీ చేయడం జరగలేదని రైతులు ఎలా సాగుచేసి జీవనం సాగిస్తారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పలాస ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయిక్రిష్ణ, చినంచల, లక్ష్మీపురం ఎంపిటిసిలు బమ్మిడి దుర్యోధనరావు, గొండు మెహనరావు, అమలకుడియా సర్పంచ్ కొర్ల శిరీషలు మాట్లాడుతూ వంశధార నీరు విడుదల చేసి నెల రోజులు అవుతున్న ఇంత వరకు శివారు ప్రాంతాల భూములకు నీరు రాలేదని, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంశదార కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు నీరు చేరిందని, ఇది వంశదార కాదని, వర్షాధార అని అన్నారు. ఒక ఏడాది మాత్రమే నీరు అందించి తమ పాలన బేష్ అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఎగువ ప్రాంతాలలో లిఫ్ట్ ఇరిగేషన్ లు అపిగలిగే శక్తి ఉంటేనే శివారు ప్రాంతాలకు నీరు అందించగలరని గుర్తించాలన్నారు. వంశదార కాలువ ఆధునీకరణ వనులు, షట్టర్లు మరమత్తులు, లిఫ్ట్ లు ఆపడం వంటివి చేపడితే కాని శివారు ప్రాంతాలకు నీరు అందే అవకాశం లేదన్నారు. అదే విదంగా రైతాంగానికి కావాల్సిన ఎరువులు అందడం లేదని, ఎరువులు పంపిణిలో కోతతో పాటు, పసుపు రంగు బిల్లలు పెట్టుకున్న వారికే ఎరువులు అందుతున్నాయని, వైసిపి చెందిన రైతులకు కాని సాధారణ రైతులకు కాని ఎరువులు అందడం లేదని, ఈ ఏడాది అంత ఎరువుల కొరత ఎప్పుడు చూడలేదన్నారు. సర్పంచ్ కోర్ల శిరీష మాట్లాడుతూ పంచాయితీలకు ఏడు నెలలుగా నిధులు విడుదల చేయకుండా పరిపాలన ఎలా చేయాలని, సూపరిపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఎంపిటిసి బమ్మిడి దుర్యోధనరావు మాట్లాడుతూ ప్రతీ సమావేశానికి సర్పంచ్ లు, ఎంపిటిసిలు, అధికారులు రావడం సమస్యలు ఏకరువు పెట్టడం జరుగుతుంది తప్పితే సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. గత సమావేశంలో చెప్పిన సమస్యను ఈ సమావేశానికి కూడా పరిష్కరించకపోతే సమావేశాలకు రావడం ఎందుకని ప్రశ్నించారు. గత వైసిపి పాలనలో ఎరువులు కొరత అనేది ఎక్కడా కనిపించలేదని, కూటమి అధికారం చేపట్టిన తరువాత ఎరువులు కోసం రైతులు రొడ్డెక్కడం చూస్తున్నామని, ఇదేనా రైతు ప్రభుత్వం అని ప్రశ్నించారు. తహసీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ రేషన్ కార్డు లబ్దిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేపడుతున్నామని, లబ్దిదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు వచ్చి స్వయంగా వేలిముద్ర వేస్తే కాని కార్డులు అందించడం జరగదన్నారు. గతంలో వేలిముద్రలు పడక లబ్దిదారులు ఇబ్బందులు పడే వారిని ఈ స్మార్ట్ కార్డు ద్వారా పి.ఆర్ కోడ్ ద్వారా రేషన్ సరుకులు ఎటువంటి అవకతవకలు లేకుండా పంపిణీ జరుగుతుందన్నారు. ఊరు నుంచి వలస వెళ్లిన వారికి ఈ సమాచారాన్ని అందించి స్మార్ట్ కార్డులు అందుకునేలా ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపిడిఓ కె.వసంతకుమార్, ఇఓఆర్డి మెట్ట వైకుంతరావు, వైస్ ఎంపిపిలు తలగాన శ్రీరాములు, నవర దాలమ్మ సర్పంచ్ లు బాడాన పుష్పలత, తామాడ మదన్, బొంతన రాజేశ్వరి, దువ్వాడ వామాక్షి కొర్ల సంతోష్, ఎంపిటిసి మద్దిల పాపారావు, వివిద శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎరువు..!! కరువు..!!

- అన్నం పెట్టే అన్నదాతలకు ఇబ్బందులు. టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్.

విశాలాంధ్ర-టెక్కలి: ఆరుగాలం శ్రమటోడ్చి... కష్టపడి పొలంలో పనిచేయాల్సిన రైతన్నలు... రోడ్లెక్కి ఎరువులు కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఒక్క బస్తా అయినా దొరుకుతుందా అని ఎరువుల దుకాణాల ముందు పడిగాపులు కాస్తున్నారు. తొలి ఎరువు వేయలేక.. కాళ్ళు అరిగేలా తిరుగుతున్న ఎరువు దొరక్క నేల చూపులు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వంలో అన్నం పెట్టే అన్నదాతల దౌర్భాగ్యమైన పరిస్థితి అని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ టిడిపి ప్రభుత్వం పాలనలో ఎరువుల కొరత పై విరుచుకుపడ్డారు. మంగళవారం ఆయన ప్రకటన ద్వారా మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో ఎరువులు దొరకక.. ఎరు వుల దుకాణం ముందు పడిగాపులు కాస్తున్న రైతులను చూస్తే మనసు కలచి వేస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితి గత ఐదేళ్లలో వైసిపి పార్టీ పాలనలో ఎప్పుడు రాలేదన్నారు. జగనన్న పాలనాకాలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన ఎరువులు సుభిక్షంగా అందజేయడం జరిగిందన్నారు. జగనన్న పాలన రైతులకు ఒక స్వర్ణ యుగమని ఆయన అభివర్ణించారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక రైతాంగం పరిస్థితి తారుమారు అయిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే కరువు కామన్ గా వచ్చేస్తుందన్నారు. రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో వైఫల్యం చెందిందని.. దీనికి ప్రధాన కారణం కూటమి నాయకులు ఎరువులను బ్లాక్ మార్కెట్కు తరలించడమే కారణంగా తెలుస్తుందన్నారు.

హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర-రణస్థలం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి సందర్భంగా హరిత ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రణస్థలం మండలం కోష్ట శ్రీ నారాయణ స్కూల్ యాజమాన్యం వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ మరియు మట్టి విగ్రహాల ఆవశ్యకతను గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హరిత ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపల్ గౌరునాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయం నిర్మాణానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కవిటి: కవిటి బీచ్ రోడ్డులో దాతల సహకారంతో నిర్మిస్తున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం గాలి గోపురం పనులకు కవిటి పంచాయతీ ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన రిటైర్డ్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఉన్నతాధికారి పిరియా కృష్ణారావు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు తన సహాయంలో రూ. 1,11,116ల భారీ ఆర్థిక సాయం అందజే శారు. ఆయన దాతృత్వానికి ఆలయ ధర్మకర్త బీపీ రెడ్డి, కవిటి సభ్యులు త్రివిక్రమరావు, మొగలిపురి సీతారాం, పాండవ చంద్రశేఖర్, ఆరంగి మధు, మార్పు అప్పలరాజు, భావన రవి, ఎం.డిల్లేశ్వరరావు, ఎం.జగన్, పొల్లాయి. హేమాచలం, పొల్లాయి దుర్యోధన, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కవిటి మండలం తెలుగుమహిళా అధ్యక్షురాలుగా దేవిక జన్నా

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలం తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలిగా దేవిక జన్నా, ప్రధాన కార్యదర్శిగా కోరాడ లక్ష్మి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పొందల కృష్ణారావు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అదేశాలమేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులకు పొందల కృష్ణారావు తోపాటు కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, ఏఎంసి డైరెక్టర్ మని చంద్రప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షులు బాసుదేవ్ ప్రధాన్, మాజీ జెడ్పిటిసి బి రమేష్, ఎస్వి రమణ, సంతోష్ కుమార్ పట్నాయక్, మణి బాబు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

శ్మశాన భూములను పరిశీలించిన తహసిల్దార్

విశాలాంధ్ర-పలాస: మండలం కంబిరిగాం చౌదరి కు టుంబానికి చెందిన సర్వే నెం 33/1లో వివాదస్పదంగా మారిన స్మశాన భూములు వ్యవహారంపై పలాస తహసిల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి, సర్వేయర్ గిరి, ఆర్ ఐ ప్రసాద్ లు మంగళవారం స్మశాన వాటిక స్థలమును,తొలిగించిన సమాదులు ప్రాంతం, శ్వశాన వాటిక బోర్డులు తీరును పరిశీలించారు. అనంతరం స్థలం కొనుగోలు చేసిన వ్యాపారి కోరాడ శ్రీనివాస్ ను తహసిల్దార్ పిలిపించి దీని పై విచారణ చేపట్టారు.చౌదరి వద్ద నుంచి స్మశాన వాటిక కొను గోలు వ్యవహారం దీనిపై పలుమార్లు జరిగిన వివాదాలపై అరా తీశారు. అంతే కాకుండా ఎంత స్థలానికి నాలా టాక్స్ చెల్లించారు. తదితర వివరాలను తమకు అందించాలని తహసిల్దార్ అదేశించారు. ఇదిలా ఉండగా చౌదరి నుంచి స్థలం కొనుగోలు చేసిన కోరాడ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ తాము చౌదరి కుటుంభీకుల నుంచి ఈ స్థలం కొనుగోలు చేసి అభివద్ధి చేసుకుంటున్న తరుణంలో ఈ స్థలంపై కాశీబుగ్గకు చెందిన టిడిపి నేత పెంట ఉదయశకంర్ కొంత మందికి రెచ్చగొట్టి ఈ స్థలంపై లేని పోని వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. గతంలో పెంట ఉదయశంకర్ కు తమకు ఉన్న వివాదాలను దృష్టిలో పెట్టుకొని లేనిపోని వారిని కూడబెట్టి ఈ స్థలంపై వివాదాలు చేసేందుకు పంపిస్తున్నారని , గతంలో కూడా శ్వశాన వాటికలో శిలాఫలకాలను కూడా తామే ద్వంసం చేసినట్లు సృష్టించి తమకు పోలీస్ స్టేషన్ కు లాగిన సంఘటనలు ఉన్నాయన్నారు. చౌదరి కుటుంభీకులు సమ్మతితో ఈ స్థలం కొనుగోలు అన్ని హక్కులు పొందినప్పటికీ తమపై లేనిపోని ఆరోపణలు చేసి తమ ప్రతిష్ట దెబ్బతీసేందుకు అధికార పార్టీలో ఉన్న పెంట ఉదయశంకర్ ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం సరికాదని, ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఉదయ్ శంకర్ బాగోతాలు కూడా బయటపెడతామని శ్రీనివాస్ హెచ్చరించారు.

మతసామరస్యానికి ప్రతీక.

విశాలాంధ్ర-కవిటి: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచి కొజ్జీరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి హెచ్ఎం గా విధులు చేపడుతున్న చాన్ సుల్తానా విద్యార్థులకు మట్టి వినాయకుని విగ్రహాలు తయారు చేయించారు. ఈ మేరకు మంగళవారం గణేశుని మట్టి విగ్రహాలు పిల్లలతో తయారు చేయించి ఆ విగ్రహాల్ని గ్రామంలో పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన విగ్రహాలు వల్ల కలిగే నష్టాలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు సకాలంలో అందించేందుకే స్మార్ట్ రైస్ కార్డులు

కళింగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు సకాలంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నిత్యావసర వస్తువులు అందించేందుకే డిజిటల్ స్మార్ట్ రైస్ కార్డులు కూటమి ప్రభుత్వం అందిస్తుందని కళింగ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలో సత్యవరం గ్రామంలో అర్హులైన వినియోగదా రులకు స్మార్ట్ రైస్ కార్డులు టిడిపి నాయకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం పాలకమండలి సభ్యులు, మావుడూరు జగదీష్‌బాబు, టిడిపి నాయకులు, కింజరాపు రామారావు, రావాడ గణపతిరావు, మెండ నర్సింహులు, చీపురు జగదీష్, బెందళాం రామకృష్ణ, గున్న కామేష్, వసనాభి హేమ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో కూటమి ప్రభుత్వం వైఫల్యం

జెడ్పీటీసి, డా.ధర్మాన కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-నరసన్నపేట: రైతాంగానికి అవసరమైన ఎరువులు అందించటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని పోలాకి జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య విమర్శించారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రతిక ప్రకటనలో పేర్కొంటూ ఆరుగాలం కష్టపడే రైతులు వరి పంటకు యూరియా ఎరువు వేయలేక, కాళ్ళు అరిగేలా తిరుగుతున్నారని దుయ్యబట్టారు. ఈ కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. నియోజకవర్గంలో ఎరువులు దొరకకా, ఎరువుల దుకాణాల ముందు పడిగాపులు కాస్తున్న రైతులు, గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వ హాయాంలో ఎరువుల కోసం ఎప్పుడూ రోడ్ల పైకి రాలేదన్నారు. కూటమి నాయకులు యూరియా ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించిన కారణంగానే నేడు ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎరువులు దొరకకా రైతన్నలు ఇబ్బందులు పడుతుంటే కూటమి నాయకులు రైతుల సమస్యలు తీర్చలేకపోతున్నారని అన్నారు. సొసైటీలకు, ఎరువుల దుకాణాలకు వచ్చే ఎరువులను ప్రక్కదారి పట్టించకుండా రైతులకు విరివిగా అందించాలని కోరారు.

వర్షం నీటిలో లక్ష్మీనగర్

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక లక్ష్మీనగర్ కాలనీ వాసులు ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లక్ష్మీ నగర్ కాలనీలోకి వర్షం నీరు ప్రవేశించింది, సుమారు ఐదు అడుగుల ఎత్తు వరకూ కాలనీలో నీరు నిల్వ ఉండటంతో రాత్రి వేళల్లో పిల్లలుతో సహా పెద్దలు కూడా బయటకు రాని పరిస్థితి నెలకొంది. మరో 24గంటల వరకూ వర్షం నీరు బయటకు వెళ్ళకుండా ఉంటుందని, ఈ సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. అంతేకాక మబగాంలోని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి దృష్టికి సమస్య వివరించి, పరిష్కారం చేయాలని లక్ష్మీనగర్ కాలనీవాసులు కోరారు.

ఫోటో నెం-6(ఎన్ఎస్పిటి) లక్ష్మీనగర్ కాలనీలో చేరిన వర్షం నీరు

లోళ్ల. రాజేష్‌కు మాతృవియోగం

విశాలాంధ్ర-కవిటి: జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి లోళ్ల. రాజేష్ మాతృమూర్తి లోళ్ల.కృష్ణవేణి (76) మంగళవారం మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె మృతి పట్ల ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు. రామారావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి దాసరి రాజు, స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మారావు, తెదేపా మండల అధ్యక్షులు పి కృష్ణారావు, మాజీ జడ్పిటిసి సభ్యులు బి రమేష్, మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, పలువురు నాయకులు, కార్యకర్తలు తమ సంతాపాన్ని ప్రకటించి నివాళులర్పించారు.

కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో...

కవిటి మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ లోళ్ల. రాజేష్ మాతృమూర్తి లోళ్ల. కృష్ణవేణి (76) మంగళవారం మృతి చెందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆమెకు నివాళులర్పించి మూడు రోజులు సంతాప దినాలు ప్రకటించి ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో స్మార్ట్ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎచ్చెర్ల స్మార్ట్ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్ష దు మెండ రాజారావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మూకళ్ల భాస్కరరావు, ఉంగటి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఫోటో: స్మార్ట్ కార్డులు

ప్రజావేదన.. పట్టించుకోని పాలన..

- వర్షపు నీటితో ప్రభుత్వ పాఠశాల ఆవరణ
- రోడ్లపైనే మురికి నీరు
- పంట కాలువలు లేక పాడవుతున్న ప్రధానదారులు
- కాలవల దురాక్రమనే కారణమా
- భవిష్యత్తు కార్యాచరణ ఎక్కడ

విశాలాంధ్ర-ఆమదాలవలస: నిత్యం ప్రజలు పడుతున్న బాధలను అధికారులు గమనించడం లేదు, పాలకులు పట్టించుకోవడం లేదు దీంతో ప్రజావేదన పలు సందర్భాల్లో ప్రత్యక్షంగా దర్శ నమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడిక క్కడే వర్షపు నీరు చేరి ఆ ప్రాంతాలు చెరువులను తల పిస్తున్నాయి. కాలవలు దురాక్రములతో రోడ్లపైనే ము రికి నీరు ప్రవహిస్తుంది. పంట కాలవలు మూసివేయ దంతో ఆ నీరు కూడా ప్రధాన రహదారులపై ప్రవహిం చి రోడ్లు పాడవుతున్నాయి. చెరువులను దురాక్రమణ చేసి నిర్మాణాలు చేపట్టడంతో అక్కడకు చేరే నీరు కూడా రోడ్లపైకి వస్తుంది. ఇదంతా వెరసి చినుకు పడితే చెరువులను తలపించే రహదారులు, మురికి నీటితో ప్రయాణ ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారు. వారు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు పాల కులకు వివరించి నప్పటికీ వాటిపై సమగ్ర ప్రణాళిక లేక నివారణ చర్యలు చేపట్టలేదు అన్న విమర్శలు ఉన్నా యి. ప్రజల వేదన పట్టించుకుని పరిస్థితులు సమస్య లు పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

వర్షపు నీటితో ప్రభుత్వ పాఠశాల ఆవరణ...

కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల పూర్తిగా నీట మునిగింది. ఇప్పటికే పాఠశాల దారులు బురద మయం కావడంతో విద్యార్థులు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఈ విషయాలు పత్రికలలో ప్రచురితమైనప్పటికీ స్థానిక ఉపాధ్యాయులు వాటిని పట్టించుకున్న పాపాన పోలే దు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు కరువయ్యాయి. జిల్లా విద్యాశాఖ అధికారి లేకపోవడంతో విద్యావ్యవ స్థలో జరుగుతున్న కార్యకలాపాలు పరిష్కరించే అధి కారి కరువయ్యారు. ఇన్చార్జిల పాలనలో పాఠశాలల దుస్థితులు ఏ విధంగా ఉన్నాయి అన్నది ప్రభుత్వ పాఠశాలను చూస్తే అవగతం అవుతుంది. చిన్నపాటి వర్షానికి చెరువుల మారి దర్శనమిస్తుంది. ఈ పాఠ శాలలో చదివిన ఎంతోమంది విద్యాధికులై పాఠశాలకు చిన్న చిన్న పరికరాలు వితరణ ఇస్తుంటారు. అయిన ప్పటికీ దీని దుస్థితి మారడం లేదు. ఉన్నతాధికారులు పటిష్ట చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రోడ్లపైనే మురికి నీరు...

పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదు అనటానికి ఉదాహరణగా చినుకులు పడితే వచ్చే వర్షపు నీరుతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహి స్తుంది. వేసవి కాలంలో డ్రైనేజీ లలో సిల్ట్ తొలగించి మురికి నీరు ప్రవహించే విధంగా సరి చేసుకోవలసిన బాధ్యత పట్టణ ఇంజనీరింగ్ అధికారిక వ్యవస్థ పై ఉంది. దానికి సంబంధించి నిధులను ఖర్చు చేసిన ప్పటికీ ఫలితం మాత్రం తగ్గటం లేదు. దీంతో ఎక్కడి కక్కడ కాలవల్లో మట్టి రాళ్లు చేరుకుపోవడంతో నీరు ప్రవాహ వేగం తగ్గుతుంది. దీంతో ఖాళీలు ఉన్న సందు ల (ఖాళీలు) నుంచి రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీనికి తో దు కాలవల దురాక్రమణ చేసి వాటిపై నిర్మాణాలు చేసి న వారిని కూడా రాజకీయ ప్రాబల్యం కోసం నోటీసులు కూడా జారీ చేయకపోవడంతో వ్యవస్థ మరింత దుర్భ రస్థితికి చేరింది. ఇటీవల కాలువలపై నిర్మాణాలు చేప ట్టిన కొందరికి నోటీసులు మున్సిపల్ అధికారులు అందిస్తే నాయకులు అధికారులపై మండిపడ్డారు. దీంతో వారు నోటీసులకు సమాధానం కూడా చెప్పలే దు అంటే ఓటు సీటు ప్రధానంగా మారింది అనేది ప్రజలు గమనిస్తున్నారు. రాజకీయ నాయకులు ప్రజా అవసరాలకు కొనుగుణంగా పాలన చేయాల్సి ఉంది. అప్పుడే చిన్నచిన్న తప్పులను సరిదిద్దుకొని ప్రజలకు అందుబాటులో పాలన ఉంటుంది.

కాలవలు దురాక్రమణె కారణమా...

పట్టణంలో డ్రైనేజీ, మురికి కాలువలు దురాక్రమణ కావడమే రోడ్లపైకి నీరు వస్తుందన్న వాదన ఉంది. ప్రధాన కాలువలపై ఎక్కడికక్కడ అడ్డ కట్టలు వేసి నిర్మాణాలు చేపట్టడంతో ఈ దుస్థితి ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు. కనకాద్రి చెరువులో ప్రభు త్వం నిర్మించిన కట్టడాలతో పాటు అనధికారిక నిర్మా ణాలు చెరువు గర్భాన్ని దురాక్రమించి నిర్మించుకున్న నిర్మాణాలతో ఆ చెరువు చిక్కి చెల్యమైంది. చెరువు

గర్భం కృంగిపోవడంతో అక్కడికి చేరిన నీరు పాతిన వానిపేట, పూజారిపేట మీదుగా రోడ్ల పైకి వస్తుంది. ఈ మురికి నీటి ప్రవాహంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో అతి ప్రాధాన్య త పొందిన పెద్ద చెరువు కబ్జాలకు గురైంది. ప్రభుత్వం కొంతమంది మాజీ సైనికుల పేరున పట్టాలిచ్చింది. మరి కొంతమంది పినా మీ నాయకులు కూరగాయలు పండిస్తామని వాటిని ప్రజలకు అందిస్తామని మరి కొంత భూమిని చేజిక్కించుకున్నారు. దీంతో చెరువు గర్భం చిక్కి పోయింది. ఇది ఇలా ఉంటే దీని ద్వారా సాగు భూమి సుమారు 230 ఎకరాలు ఉంది. చెరువు దిగున పాలకొండకు వెళ్లే ప్రధాన రహదారి ఉండటంతో ఆ ప్రాంతంలో భూములకి మంచి గిరాకీ ఏర్పడింది. నాళాలు కట్టకుండానే నిర్మాణాలు చేపట్టారు. అందు లో నాయకులు, పార్టీలో రెండో తరగతి నాయకులు కారణంగా దిగువ పంట భూములకు వెళ్లే కాలువలను మూసివేశారు. దీంతో చెరువులోకి వచ్చే వర్షపు నీరు కిందికి ప్రవహిస్తుంది. ఈ కారణంగా కాలువలు లేక పోవడంతో రోడ్లపైనే కాలవలను తలపించేలా ప్రవ హిస్తున్నాయి. నిత్యం నీటి ప్రవాహంతో రోడ్ల పాడౌతు న్నాయి. రోడ్లోకి ఇరువైపులా ప్రధాన మార్కెట్ లా తయారైన షాపింగ్ లు సముదాయాలు ఉండటంతో ఈ నీరు ఆ పొలాలకు అవసరం లేకుండా పోయింది. అయినప్పటికీ ప్రవాహం దిగు కి వెళ్ళక తప్పదు. పంట కాలువలను మూసివేసి, మురికి కాలువలను దురాక్ర మణ చేసిన కారణంగా ఈ దుస్థితి ఏర్పడుతుందని స్థానికులు అంటున్నారు.

భవిష్యత్తు ప్రణాళిక ఎక్కడ...

పట్టణాభివృద్ధికి భవిష్యత్తు ప్రణాళిక లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి చెరువులను తలపించే రోడ్లు తయారవుతున్నాయి. పాలకులు ఎన్నికల ముందు అక్షర క్రమంలో ఆమదాలవలస అగ్రస్థానంలో నిలుపు తామని ఊదరగొట్టుడు ఉపన్యాసాలు అందిస్తారు. కార్యాచరణలో మాత్రం అమలకు నోచుకోవటం లేదు. 2014 -19 కాలములో 235 కోట్ల రూపాయలతో పట్టణాన్ని అభివృద్ధి చేశామని అప్పటి పాలకులు ప్రచారం చేశారు. అనంతరం నేటికీ పురపాలక సంఘ ఎన్నికలు జరగలేదు. ఆ నిధులతో చేసిన పనులు ఏమిటో పాలకులకే తెలియాలి. నగరపాలక సంస్థ నుంచి పురపాలక సంఘంగా రూపాంతరం చెందిన తరువాత అప్పటి పాలకులు వార్డుల వారీగా సమ స్యలను సేకరించి సమగ్ర నివేదికతో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని ప్రకటించారు. ఆ ప్రకటన కాలగర్భంలో కలిసిపోయింది. అనంతరం ఏర్పడిన ప్రభుత్వాలు కూడా అభివృద్ధితో కూడిన నారాయణ మంత్రం ప్రణాళికతో అభివృద్ధి చేస్తామని ప్రకటించడమే కానీ ఆచరణకు నోచుకోలేదు. శివారు వార్డులకు తాగునీరు, ప్రధాన రహదారులు, పార్కింగ్ స్థలాలు, క్రీడా మైదానం, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, ఇంటింటా తాగునీరు, 23 వార్డులను అనుసంధానం చేసే రహదారులు తదితర అంశాలతో ప్రణాళిక రూ పొందించి అభివృద్ధి చేయవలసిన బాధ్యత పాలకు లపై ఉంది. పట్టణ అభివృద్ధికి అవసరమయ్యే ప్రణా ళిక రూపొందించడంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాల్సిన బాధ్యత కూడా ఉన్నతాధికారుల పై ఉంది. ఏది ఏమైనా పట్టణాన్ని అభివృద్ధి చేసి ప్రజ లు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా పాలన జరగాలని పట్టణ ప్రజలు ముక్తకం ఠంతో కోరుతున్నారు.